రంజని

# పేపర్ అండర్ కన్సిడరేషన్

పాలకోడేటి సత్యనారాయణరావు

ఈ రోజు...ఏం జరుగుతుందో కానీ దానికెంతో ప్రాముఖ్యం ఉంది నా జీవితంలో-అందుకే ఈ రోజు కోసమే నేను చాల కాలంగ ఎదురు చూస్తున్నాను. ఎదురుచూస్తున్నది ఈరోజు కోసమేనని నాకు వారం రోజుల క్రితం తెలిసింది.

-వారం రోజుల క్రితం...

నేను వెళ్ళే సరికి ఊర్మిళ ఏదో ఫైలులో కాగితాలు అటూ ఇటూ తిప్పుతోంది. నన్ను చూసి పలకరింపుగా నవ్వింది. వెళ్ళాను-ఆవిడ టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చున్నాను.

"ఏమిటి చేస్తున్నారు?" అనడిగాను నేను.

"ఆఫీసు పని- చూస్తున్నారు కదా, ఇదిగో...!" అంది ఊర్మిళ, టేబిల్ మీద ఉన్న కాగితాలను, చిన్న చిన్న ఫ్లాగ్‌లను చూపిస్తూ. ఆ ఫ్లాగ్‌లమీద 'పియుసి', 'ఓయన్'-ఇలాగే ఇంకేవో రాసి ఉన్నాయి.

"ఏమిటి ఇవన్నీ ?" అనడిగా ఆ ఫ్లాగ్‌లను చూపిస్తూ.

"పి.యి.సీ. అంటే పేపర్ అండర్ కన్సిడరేషన్. ఈ ఫ్లాగ్ గుచ్చి ఈ పేపర్‌ను ఫైల్లో పెట్టి ఆఫీసర్ గారికి పంపితే.... "ఇంకా ఏదో చెప్తోంది ఊర్మిళ నవ్వుతూనే.

"సర్లెండి-అంటే ఫైలు పెట్టడానికి ముందు ఈ పేపర్ తప్పనిసరి అన్నమాట!-అయితే నేను ఓ పి యుసీ తెచ్చాను మీకోసం!" అని ఆగాను.

"మీరు...పి.యు.సి. తెచ్చారా?"ఆశ్చర్య పోతూ అంది ఊర్మిళ.

"అవునండీ! బట్, నేను తెచ్చిన పి.యు.సి మీరనే పేపర్ అండర్ కన్సిడరేషన్ కాదు-ఇది ప్రపోజల్ ఫర్ యువర్ కన్సిడరేషన్?-"

"చెప్పండి!-"

"చెప్పటం కాదు, కాగితం మీద రాసిస్తాను!"అని ఆగాను. ఊర్మిళ నవ్వింది-డ్రాలోంచి ఒక తెల్లకాగితం తీసి నాకు అందించింది. 'పెన్ను?' అన్నట్లు చూశాను. అదీ అందించింది-"ఏమిటో, కాగితం, పెన్ను అన్నీ నేనే ఇవ్వాలి. ఇదేం పద్ధతి? ఆఫీసు కొచ్చి పని చేయించుకో దల్చుకొన్న వాళ్ల అన్నీ తామే తెచ్చుకోవాలి కానీ ... ఈ పద్ధతి ఇంకెక్కడా ఉండి ఉండదు!"-

"మిగిలిన అన్నిచోట్లా వేరు. అక్కడ పనిచేస్తే లభించింది ఒక్క దరఖాస్తు దారునికే! ఇక్కడ అలా కాదు, ఈ పని పూర్తయితే - ఇటు నాకు లాభమే, అటూ మీకూ లాభమే! అన్నాను.

"సర్లెండి, రాయండి చూద్దాం!"

రాశాను, రెండే వాక్యాలు, పూర్తియ్యాక అకాగితానికి పైన పియుసి అన్న ఫ్లాగ్‌ను గుండు సూదితో

గుచ్చి, ఒక ఫైల్ కవర్‌లో పెట్టి అందించాను. అందు కొని, చదివి నవ్వింది. ''బాగుంది!'' అంటూనే ఆ కాగితం పై ఉన్న ఫ్లాగ్ తీసి, కాగితాన్ని మడతపెట్టు కొంటూ బాగ్‌లో పెట్టింది.

''అయిపోయిందా?'' అనడిగాను.

''ఉహూ, మీరు ఇచ్చారుకదా పియుసి, అది చదివి, డిస్పోజ్ చెయ్యటానికి నాకు కనీసం వారం పడు తుంది!''

''అంటే!...''

''వచ్చే వారం రండి, అప్పటికి నా నిర్ణయం చెప్తాను!''

''అంత టైమా?''

''అవసరం-ప్రాస్ అండ్ కాన్స్ అన్నీ చూడాలి, కేస్ హిస్టరీ చదవాలి. పర్సనల్ ఫైల్ తెప్పించి చూసు కోవాలి. అన్నీ సరిపోతే-అప్పుడు నిర్ణయం!''

-అదీ ఊర్మిళ ఆ రోజు అన్నది. ఊర్మిళ కోరిన వారం రోజుల గడువు నేటితో అయిపోతుంది.

ఏం చెప్తుంది?-

-ఏం చెప్తుంది...థ్యాంక్స్ అంటుంది! అయామ్ హాపీ, అంటుంది. అసలు అంతకు మించి ఏముంటుంది అనేందుకు!

-నేను...అద్దంలోకి, గతంలోకి చూసుకోకుండానే చెప్పొచ్చు - నేను బాగుంటాను. నా జీవితం ఇంత వరకూ ఘనంగానే గడిచింది. దేనికీ లోటు లేదు. చదువు ఎంత వరకు చదవాలని అనిపించిందో అంత చదివాను. ఫుల్‌స్టాప్ పెట్టి ఉద్యోగం చేసుకొందామను కోగానే ఉద్యోగము దొరికింది-ఎనిమిదొందలు వస్తు న్నాయి. మంచి కుటుంబం, ఉన్నత సంప్రదాయం-చూడగానే ఓకే చేయాల్సిన సంబంధం నాది! కోరి పాణిగ్రహణం చేస్తానన్నాను. ఊర్మిళ ఊరికి నా ఇంటికి దీపంగా వచ్చేందుకు సిద్ధంగా ఉండాలి!

-ఊర్మిళ-నా జీవితానికి రెండో వైపు. జీవితంలో బెటర్ హాఫ్, బాగానే ఉంటుంది. కొట్టవచ్చేంత అందం కాదు కానీ భార్యగా చాలు! భార్యా రూపవతీ శత్రుః అని సామెత. కావాల్సింది భార్యగానీ సినిమా స్టార్ కాదు. కనిపించాల్సింది. ఆకర్షణీయంగా-నాకే కానీ ఇతరులకు కాదు! నాలో కోరికలకు మేలుకొలుపు పాడాలి కానీ ఇతరులలో పైత్యాన్ని ప్రకోపించనీయ కూడదు! భార్యకు ఉండాల్సిన లక్షణాల్లో ఇవి ముఖ్య మైనవి. ఊర్మిళలో ఇవి ఉన్నాయి. పైగా చదువు కొంది. ఉద్యోగం చేస్తోంది. వేన్నీళ్లకు చన్నీళ్ళ తెస్తోంది. ఇంటిని నా ఒంటినీ సుఖపడనిస్తుందనే అని పిస్తోంది. అందుకే-పియుసీ ఇచ్చేశాను.

వెళ్లాను, వెళ్ళే సరికి ఊర్మిళ సీట్లోనే ఉంది 'అన్నీ మంచి శకునములే' అనిపిస్తోంది. ఎపుడో ఆరేడు నెలల క్రితం రాసిన పరీక్షలకు నిన్న ఫలితాలు వచ్చాయి. పరీక్షల్లో నేను నెగ్గాను. డాక్టర్ చేసే మెడికల్ ఎగ్జామి నేషన్ తర్వాత నేను కూడా ఊర్మిళ చేస్తున్న ఆఫీసు లోనే ఉద్యోగం చేపట్టవచ్చు - మంచి ఉద్యోగమే! అయినా, ఊర్మిళకు దగ్గర్లో ఉండొచ్చు, కలిసి రావచ్చు కలిసి పోవచ్చు. ఇంట్లో జీవితాన్ని, బయట ప్రపంచాన్ని కలిసి అనుభవించొచ్చు! ఊర్మిళ తను తీసుకొన్న నిర్ణయం చెప్తే, నేను ఈ శుభవార్త ఆమెతో పంచుకొంటాను.

''రండి!-''అంది ఊర్మిళ సాదరంగా.

కూర్చున్నాను, కుర్చీలో కాదు. ముళ్ళ మీద! నన్ను నిలవనీయటంలేదు మనసులో ఏదో ఆందోళన-ఆందోళనా అది, కాదు. సంబరమే! నాలో ఆనందం

ఆనందపు టంచుల్ని తాకి ఉవ్వెత్తుగా ఎగుస్తోంది! నా మనసులో ఎక్కడో మించు కన్నె గజ్జెకట్టి పరవశంలో నాట్యం చేస్తోంది!!

''ఏం చేశారు?'' అనడిగాను.

''ఉండండి, చెప్తాను!'' అంది నవ్వుతూ-క్షణం ఆగి అంది తనే; ''మీ పియుసిని బాగా పరిశీలించి...''

''థ్యాంక్స్'' అనేశాను ఆత్రుతతో!

''సారీ-నో, థ్యాంక్స్ ప్లీజ్...''

-ఉలికి పడ్డాను నేను! అంటే, ఎమిటి...ఏమిటి అంటోంది? కానీ... కారణం ?... ఏముంది నాకు అనర్హత? బహుశా నాఅంతట నేనే అడగటమే కాబోలు! వనిత తనంత దావలచివచ్చిన...అని రాశాడు పెద్దన-తనంత తావలచి వచ్చింది వనిత కాకపోయినా అంతే నని ఈ సంఘటన చెప్తోంది.

క్షణం ఆగి అడిగాను - ''ఊర్మిళా-ఇలా అడుగుతున్నాననుకోవద్దు. ఎందుకు ఇలా చేశావు'' అన్నాను.

-మా ఇద్దరికీ పెళ్ళయి ఉంటే నేను ఊర్మిళను 'ఊర్మిళా!'అనే పిలిచి ఉండే వాడిని. పెళ్ళి కాకపోయినా కూడా, ఆమె నన్ను వద్దంటున్నా కూడా నేను ఇప్పుడు అలాగే పిలిచాను. ఆమె దాన్ని, నా ఏకవచన సంబోధనను పట్టించుకోలేదు. ఆమె ప్రపంచంలో ఆమె ఉంది. ఆ ప్రపంచంలోని రంగుల్ని, రంగుల కలల్ని నాకు చూపిస్తూ అంది-''ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి! మీ కాలేజీ జీతం ఎంత? ఏడెనిమిదొందలు ! నాకొచ్చే మరో అంత! అంతే కదా! మొత్తం ఏ పదిహేనో పదహారొందలు. కట్స్ తీసేస్తే మిగిలేది వెయ్యికి మించదు. ఏం బతుకుతాం చెప్పండి!...అసలు మీరీ పియుసి ఇవ్వకమునుపు నాకు పెళ్ళిమీద ధ్యాస ఉండేది కాదు. కానీ బాగా పరిశీలిస్తే...ఇపుడొక అభిప్రాయం ఏర్పడిందినాకు చెప్తున్నా వినండి ఏఐయ్యేయస్ ఫీసరో-కనీసం ఏ బాంక్ ఆఫీసరో అయితే నేను పెళ్ళి గురించి ఆలోచించ కూడదని నిర్ణయించుకొన్నాను!

-కలలు! రంగుల కలలు, వాస్తవానికి కోట్ల మైళ్ళ ఎత్తున ఉండే ఆశలు. అందు కోవాలని వృథా ప్రయాసలు!!

''నాదంతా ప్రాక్టికల్ అప్రోచ్!!'' అనేసింది ఊర్మిళ నాలోని ఆలోచనల్ని పసిగడుతున్నట్లుగా.

-అడాళ్ళు, పోలీసు కుక్కల వంటి వాళ్ల కాబోలు! వాసనచూసి పట్టేస్తున్నారు ఆలోచనల్ని! ఇదిస్వతహాగా వచ్చే లక్షణం అయితే, ఊర్మిళ చదువుకొంది, పైగా ఉద్యోగం కూడా చేస్తోంది!!

ఆకాశంలో ఉండే మనిషిని నేలమీద నడవమనటం తెలివి తక్కువ తనమని నాకు తెలుసు. తను నేల మీదకు దిగదు సరికదా నన్ను-నేనే నేలమీద ఉన్నానని ఈసడించు కొంటుంది. కలలకు, వాస్తవానికీ పొంతన కుదరదు-ఈ సంగతి ఊర్మిళకు తెలిసే సరికి ఇంకొంత కాలం పట్టొచ్చు.

''సారీ అండి, మిమ్మల్ని డిసప్పాయింట్ చేశానని, ఇన్సల్టు చేశానని అనుకోవద్దు!''అంది మనస్ఫూర్తిగానే ఊర్మిళ.

నవ్వాను-''ఇందులో అనుకోవల్సింది ఏమీ లేదు. పెళ్ళి చేసుకోవటం తప్పదు. అది నిన్నే చేసుకొంటే... అనుకొన్నాను. అందుకే ప్రపోజ్ చేశాను. ఇక డిసప్పాయింట్ మెంట్ కూడాఏమీలేదు-ఎందుకంటేనన్ను ఈ ఆఫీసులోనే అప్పాయింట్ చేస్తూ ఆర్డర్స్ ఇచ్చారు!'' అన్నాను నేను కొంత సరదాగా, కొంత నిజాయితీగా.

''నిజం?-గుడ్-''అంది ఊర్మిళ.

ఊర్మిళకు నాకొచ్చిన ఆర్డర్స్ చూపించాను. 'పెళ్ళి చేసుకొంటే కలిసివచ్చే వాళ్ళం కదా!' అనీ అన్నాను. 'పోనీ ఇపుడు మాత్రమేం, కనీసం రోజూ చూసుకో వచ్చు'అని వేళాకోళమూ ఆడాను. 'ఎంతటి డ్రీమ్‌గర్ల్ అయినా, పెళ్ళి చేసుకొంటే గ్లామర్ పోతుంది. కానీ ఇపుడు పెళ్ళి చేసుకోవటం లేదు కనుక నీలో గ్లామర్‌ను గుర్తిస్తూనే ఉండొచ్చు!' అనీ అన్నాను. అన్నిటినీ ప్రశంసలుగానే అందు కొంది ఊర్మిళ.

-ఆర్నెల్లు తిరిగే సరికి నాకు పెళ్ళయింది, సీతా లక్ష్మితో. 'ఊర్మిళ పోతే పోయింది, ఏకంగా సీతనే చేసుకొంటున్నారు కదా!' అంది ఊర్మిళ!

ఊర్మిళలా సీత ఉద్యోగం చేయదు. నెలకు ఎనిమి దొందలు సంపాదించదు. ఊర్మిళ అంత ఆకర్షణీయం గానూ ఉండదు. అయితేనేం ఈ అనర్హతలన్నిటికీ బదులుగా, నేలమీద నాతో నడిచేందుకు సిద్ధంగా ఉంది. అదొక్కటే ఆమె గుణ గణాలతో మేలు బంతి!

-'మాంగల్యతంతు నానేన.' నుంచి కలిసి నడవటం ఆరంభించాము. ఇప్పటికి మాకిద్దరు పిల్లలు కూడానూ!

ఆరేళ్ళు గడిచాయన్న సంగతి పిల్లల్ని చూస్తేగానీ గుర్తుకు రాదు.

-ఊర్మిళ ఇంకా పీయుసీలతోనో, నోట్సులతోనో కుస్తీ పడుతూనే ఉంది.

-మరో ఆరేళ్ళు గడిచాయి, నా జీవితంలో రావాల్సిన మార్పులన్నీ వచ్చేస్తున్నాయి. తల వెంట్రుకలన్నీ ఊడి పోతున్నాయి. మీసాలు తెల్లబడుతున్నాయి. రెండంతస్థుల మెట్లు ఒక్క ఊపున ఎక్కే ఆలోచన రావటం లేదీమధ్య. వయసు ముప్పయి అయిదు దాటిందన్న పేరేగానీ, ఆశలేవలేక - రిటైర్ మెంట్ మీదనే చూపులు నిలుస్తున్నాయి.

-అటు ఊర్మిళ...ఆమెలోనూ జీవితం తెచ్చిన మార్పులు చాలానే కనిపిస్తున్నాయి. పది పన్నెండేళ్ళ కిందట ఆ అమ్మాయి పట్ల నాకు పెళ్ళిచేసుకొనేంత ఇష్టం ఉందంటే నేనే నమ్మలేకపోతున్నాను. ఆమె కలల్లోని రాజకుమారుడు ఇంకా ఎక్కడో విహరిస్తున్నట్లే ఉన్నాడు-ఆమె కోసం ఇలమీదకు ఇంకా దిగి రాలేదు.

ఊర్మిళ ఆ రోజు అటెటో వెడుతూ ఓసారి మా ఇంట్లోకి తొంగి చూసింది. సీతకు మా ప్రేమ కథ తెలుసు కాబట్టి ఊర్మిళను సాదరంగానే ఆహ్వానించింది. ఉన్న అరగంటలోనూ ప్రపంచంలోని అన్ని విషయలూ మాట్లాడేసు కొన్నారు. మెట్లు దిగుతూనే ఊర్మిళ నవ్వుతూ అంది; ''పొరబాటైపోయింది. ఆ రోజున ఊ అని ఉంటే బాగుండేది! ఈ రోజున మమ్మల్ని నేను సాగనంపుతూ ఉండేదాన్ని!''

సీత నవ్వేసింది.

''నేను అనుకొంటాను, మీరు పొరబాటు చేశారని! ఈయన అనికాదు, ఎవరైనాసరే. సరైనజోడీ అను కొంటే పెళ్ళి చేసుకోవడమే మంచిది!...నాకనిపిస్తోంది, మీకు మీ ఉద్యోగమే కొంత హాని చేసిందని!" అంది సీత.

ఊర్మిళ ఏమీ అనలేదు.

మెట్లుదిగి బస్సుస్టాండ్ చేరాం.

అక్కడ అంది ఊర్మిళ, ఒక్కసారి గతంలోకి చూసుకొంటూ;" మీ ఆవిడ అన్నది నిజమే ! నాకు హాని చేసింది నా ఉద్యోగమే అని నాకూ అనపిస్తుంది. కానీ ఏం చేయను? ఆ రోజు పరిస్థితి వేరు-కోరుకొన్నది

సాధించుకోలేకపోతామా అనే మొండితనం ఉండేది. దాని వల్ల ఏం మిగిలింది?–ఒంటరి మోడులా నిలబాల్సి వస్తోంది! రాని బస్సుకోసం ఇలా వెయిట్ చేయటం మిగులుతోంది!'' అంది ఊర్మిళ.

ఊర్మిళకేసి చూశాను–ఆమె కళ్ళల్లో చెప్పలేనంత దైన్యం చేసినది తప్పనే అభిప్రాయం. చేతికి అందే ఉట్టిని కాదని స్వర్గం కోరానే అన్న పశ్చాత్తాపం. ఇంకో అక్షరం ఏది మాట్లాడినా ఆమె కళ్ళల్లోంచి... ఉహూ–ఊర్మిళ...పేరు కూడా ఎంత బాగా సరి పోయింది! భర్త అడవులకు వెడితే పురాణం ఊర్మిళ నిద్రపోయి కలల్లో తేలింది. నిద్రలేచేసరికి భర్త ఎదురుగా నిలిచాడు! కలల్లోంచి వాస్తవంలోకి వచ్చి చేరింది. కానీ ఈ ఊర్మిళ–ముందే కలలు కనటం ఆరంభించింది. కలల్లోనే ఆకాశాన్ని అందు కోవాలని ప్రయత్నించింది. ఆ కలల్లోనే ఉంటూ కాలాన్ని చేజార్చుకొంది. కలలు కలలేనని తెలిసే సరికి... ఆలస్యం అయిపోయింది. అటు కాలం. ఇటు యవ్వనం, ఆఖరికి అన్ని అవకాశాలూ పోయాయి.

ఆలోచనలు ఆపి–ముందుకు చూశాను.

ఊర్మిళ ఎక్కాల్సిన బస్సు నాకు ఎక్కడా కనిపించలేదు.

నేను చేయెత్తితే
నక్షత్రాలు రాలుతాయి
నా గొంతెత్తి అరిస్తే
భూనభోంతరాలే దద్దరిల్లుతాయి.